# పుణ్యఫలం

మోహన రెడ్డి

A

అడల్ట్స్ ఓన్లీ కథ!

సమయం సాయంత్రం ఐదు గంటలు.

నేమ్‌బోర్డు చూసి నిర్ధారించుకుని ఆఫీసులోకి అడుగు వేసింది తులసి.

రిసెప్షనిస్ట్ చిరునవ్వుతో ఆమె వైపు చూసింది ఏం కావాలన్నట్టుగా.

''విశ్వనాథ్‌గారిని కలవాలి''

అతని కేబిన్ వైపు చూపించిందామె.

''థాంక్స్'' ఆమెతో చెప్పి అటు వైపు నడిచింది.


తన కేబిన్‌లోకి వస్తున్న తులసిని చూసి ఆశ్చర్యపోయాడు విశ్వనాథ్.

''బావున్నారా?'' పలకరింపుగా నవ్వాడు.

''మీతో మాట్లాడాలి''

''కూర్చోండి''

తులసి వైపు పరిశీలనగా చూసాడు. అలసటగా ఉంది ఆమె ముఖం.



''మంచి నీళ్ళు తీసుకుంటారా?'' అడిగాడు.

తలూపింది కావాలన్నట్టుగా.

లేచి మంచినీళ్ళు అందించాడు.

అతని చేతిలో నుండి గ్లాసు అందుకుంది.

''నన్ను పెళ్ళి చేసుకుంటారా?'' ఒక నిముషం తర్వాత అడిగింది.

మరింత ఆశ్చర్యపోయాడు.

''మా పెదనాన్న అల్లుడితో రేపు తెల్లవారుఝామున నా పెళ్లి చేయాలని నిర్ణయించారు. భర్త పెట్టే బాధలు భరించలేక మా పెదనాన్న కూతురు రెండు నెలల క్రితం కిరసనాయిలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. నా పెళ్ళిచేసే ఆర్థిక స్థోమతలేని మా నాన్న ఇప్పుడు నన్ను ఆ కిరాతకుడికిచ్చి కట్టబెట్టడానికి సిద్ధపడ్డాడు. మూడు నెలల క్రితం మనం పెళ్ళిచేసుకుందామా అని మీరు నన్ను అడిగారు. ఇప్పుడు ఆ మాట నేను మిమ్మల్ని అడుగుతున్నాను. నన్ను పెళ్ళి చేసుకుంటారా చెప్పండి''

శక్తిని కూడదీసుకుని మాట్లాడింది.

ఆమెవైపు తదేకంగా చూస్తున్నాడు విశ్వనాథ్.

చేతిలో ఉన్న కర్చీఫ్ మడత విప్పింది తులసి. కొద్దిగా చిల్లర డబ్బు, పసుపు కొమ్ముకు కట్టిన దారం ఉన్నాయి అందులో.

''మీ దగ్గరకు వస్తున్నానని మా చెల్లెలితో మాత్రం చెప్పి ఇంట్లోనుండి వచ్చేశాను. బయల్దేరే ముందు ఇంటిదగ్గర ఉన్న అమ్మవారి ఆలయంలోకి వెళ్ళి దర్శనం చేసుకున్నాను. ఆలయంలో నుండి ఈ పసుపు తాడు తీసుకువచ్చాను''

రెండు నిముషాలు నిశ్శబ్దంగా ఆమెవైపు చూస్తూ ఉండిపోయాడు.

కుర్చీలో నుండి లేచాడు.

''వెళదామా?'' అడిగాడు.

''ఎక్కడికి?'' ప్రశ్నించిందామె.

''మీ ఊరికి. మీ అమ్మ, నాన్న కంగారు పడుతుంటారు. మిమ్మల్ని తీసుకెళ్ళి వాళ్ళకు అప్పగించడం నా బాధ్యత'' అన్నాడు.

బలహీనంగా నవ్వింది.

''ఇప్పుడు మీరు నన్ను మా ఊరు తీసుకెళితే ఆత్మహత్య ఒక్కటే నాకు శరణ్యం. ఆ రాక్షసుడి చేతిలో బాధలు పడి ఆత్మహత్య చేసుకోవడం కంటే ముందే చనిపోతే కనీసం ఆ కష్టాల నుండయినా తప్పించుకోవచ్చు. మీ ఇష్టం. మీరు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నేను కట్టుబడి వుంటాను'' తల వంచుకుని చేతిలోని పసుపు తాడు వైపు చూస్తోందామె.

నిశ్శబ్దంగా బయటికి నడిచాడు. అతని వెనుక నడిచింది తులసి.

ఎక్కడికి అని మరోసారి అడగదల్చుకోలేదు.

తను చెప్పవలసింది చెప్పింది. ఇక నిర్ణయం తీసుకోవడం అతని ఇష్టం. అతను పెళ్ళి చేసుకుంటే సరే సరి. లేకపోతే చనిపోవాలని నిర్ణయం తీసుకునే తను ఇంట్లోనుండి వచ్చేసింది.

బైక్ స్టార్ట్ చేయబోయి ఆగిపోయాడు.

''మా అమ్మతో మాట్లాడాలి'' తులసితో చెప్పి పక్కనే ఉన్న ఎస్‌టిడి బూత్‌వైపు నడిచాడు.

''అమ్మా'' ఫోన్‌లో తల్లితో మాట్లాడుతున్న అతని గొంతులో ప్రేమ తొణికిసలాడింది.

''ఏం నాన్నా?'' ఆప్యాయంగా అడిగిందామె.

''ఫోన్ చేసినప్పుడల్లా పెళ్ళి చేసుకోమని పోరు పెడుతున్నావు కదా! ఇప్పుడు పెళ్ళి చేసుకోనా?'' సరదాగా అడిగాడు.

''పెళ్ళిచూపులకు వెళదామని ఎన్నిసార్లు అడిగినా వాయిదా వేస్తున్నావ్. ఇప్పటికప్పుడు పెళ్ళి ఎలా చేసుకుంటావురా?''

''తులసి వచ్చింది. నన్ను పెళ్ళి చేసుకుంటారా అని అడిగింది'' తల్లికి వివరంగా చెప్పాడు.

''ఆడపిల్ల తెగించి ఇంట్లోనుండి వచ్చేసి నిన్ను నోరు తెరిచి అడిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోకన్నా! నా మాట విని వెంటనే ఆ అమ్మాయిని పెళ్లి చేసుకో. ఇప్పటికప్పుడు నేను బయల్దేరి వద్దామంటే కాలేజీలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి''



''అమ్మా! తులసితో మాట్లాడు'' పక్కనే నిలబడ్డ ఆమెకు ఫోన్ అందించాడు.

అతని చేతిలో నుండి రిసీవర్ అందుకుని ''హలో'' అంది నెమ్మదిగా.

''నీ గురించి మూడు నెలల క్రితమే నాకు తెలుసు తులసీ! విశ్వనాథ్ అంతా చెప్పాడు. వెంటనే గుడిలో పెళ్ళి చేసుకోండి. నేను వీలు చూసుకుని త్వరలో వస్తాను. మీ వైవాహిక జీవితం శుభప్రదంగా సాగాలి'' కాబోయే కోడలికి ఆశీస్సులు తెలిపిందామె ఫోన్‌లో.

వణుకుతున్న చేతులతో రిసీవర్ విశ్వనాథ్‌కు అందించింది తులసి.

తల్లితో రెండు నిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

''అమ్మ విశాఖపట్నంలో కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తోంది. పరీక్షలు జరుగుతున్నాయి కదా చాలా బిజీగా వుంది''

బైక్ స్టార్ట్ చేసి కూర్చోమన్నట్టుగా ఆమెవైపు చూశాడు. సందేహంగా నిలబడింది.

''కూర్చో'' మృదువుగా చెప్పాడు.

ఎక్కి కూర్చుంది. స్టార్ట్ చేసిన వెంటనే ముందుకు కొంచెం తూలి అతని వీపునకు తల ఆనించింది.

''జాగ్రత్తగా పట్టుకో'' చెప్పాడు.

ఇంతకు ముందు విశ్వనాథ్ ఉద్యోగం చేసిన ఊళ్ళో అతని ఎదురింట్లో తులసి వాళ్ళు ఉండేవాళ్ళు. దిగువ మధ్యతరగతి కుటుంబం ఆమెది. ఉదయం, సాయంత్రం వేళల్లో అతను అద్దెకు ఉండే ఇంట్లో మంచినీళ్ళ కోసం వచ్చేదామె ప్రతిరోజూ. ఎన్నడూ తలెత్తి అతని వైపు చూసేది కాదు.

తెల్లగా, బొద్దుగా వుండే ఆమెను చూస్తే ఇష్టంగా అనిపించేది అతనికి.

బిందెలోకి మంచినీళ్ళు నింపుకుని వెళ్ళబోతున్న ఆమె దగ్గరకు వెళ్ళాడు ఒకరోజు.

''నాకు మీరంటే చాలా ఇష్టం. మీరు కూడా నన్ను ఇష్టపడితే పెళ్ళి చేసుకుంటాను. మీ పెద్దవాళ్ళతో మాట్లాడమంటారా?'' అడిగాడు.

విశాలమైన కళ్ళను మరింత పెద్దవి చేసి అతని వైపు చూసింది.

''మా నాన్నగారితో మాట్లాడండి'' జవాబు చెప్పి గబగబా తమ ఇంటివైపు నడిచింది.

తులసి వెనుకే వెళ్ళాడు ఆమె తండ్రితో మాట్లాడటానికి.

విశ్వనాథ్ మాటలు విని నిప్పులు కురిసే కళ్ళతో అతనివైపు చూశాడు తులసి తండ్రి.

నాలుగడుగులు ముందుకు వేసి విశ్వనాథ్‌ను కొట్టడానికి చేయి ఎత్తబోయాడాయన.

భర్తకు అడ్డుపడింది తులసి తల్లి.

## కొత్త వివాదం

**ఈమధ్య వివాదాలకు కేంద్రబిందువవుతోంది సినిమా రంగం. ఎప్పుడూ వార్తల్లో వ్యక్తులుగా చలామణీ అవుతుంటారు సినీతారలు. సినిమాలతో పాటూ వ్యాపారసంస్థలకు బ్రాండ్ అంబాసిడర్స్‌గా వ్యవహరిస్తూ రెండుచేతులా సంపాదించే తారలు కొన్నిసార్లు తమ చర్యల మూలంగా వివాదాల్లో పడతారు. సెక్సీతార కత్రినాకైఫ్ ఇప్పుడో వివాదంలో నిండా మునిగిపోయింది. 'బూమ్'చిత్రంపై ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు చిలికి చిలికి గాలివానగా మారే అవకాశాలున్నాయంటున్నారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ యునిసెఫ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న కైఫ్ ఆ సంస్థ ప్రకటనల్లో నటించింది. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఏం జరగనుందో చూడాల్సిందే.**

తమాయించుకున్నాడాయన.

''పెళ్ళి పేరుతో నీ కోరిక తీర్చుకుని నా కూతురి జీవితంతో ఆడుకుందామనుకుంటున్నావా? ఇరవై ఏళ్ళ క్రితం నా చెల్లెలు ఇలాగే నీలాంటి ఒక మోసగాడి మాటలు నమ్మి వెళ్ళిపోయింది. పదిరోజుల తర్వాత ఊరిబయట బావిలో శవమై తేలింది. చరిత్ర పునరావృతమై నా కూతురికి అలాంటి పరిస్థితి రాకూడదు'' కోపాన్ని, దుఃఖాన్ని తమాయించుకుని చెప్పాడాయన.

''నేను అలాంటివాడ్ని కాదు'' వివరంగా చెప్పబోయాడు విశ్వనాథ్.

''ఇంకెప్పుడూ మాకు ఇలాంటి కథలు ఆశలు కల్పించవద్దు. మీలాంటి వాళ్ళు మమ్మల్ని వాడుకుని విసిరేస్తారు. ఆ విషయం నాకు బాగా తెలుసు'' ఇంకా మాట్లాడటానికి ప్రయత్నించి ఆవేశంతో మాట రాక కూర్చుండిపోయాడాయన.

వెళ్ళిపొమ్మన్నట్టుగా చేతులెత్తి నమస్కరించింది తులసి తల్లి.

తాను మాట్లాడి ఉపయోగం లేదనుకుని మౌనంగా వెనుదిరిగాడు.

ఆ తర్వాత తులసి ఇక మంచినీళ్ళ కోసం రాలేదు.

రెండు వారాల తర్వాత తెల్లవారుఝామున ఐదు గంటలకు సూట్‌కేస్ తీసుకుని రైల్వేస్టేషన్‌కు బయల్దేరిన విశ్వనాథ్‌కు వీధిలైటు వెలుగులో ముగ్గు వేస్తూ కనిపించింది తులసి.

ఆమె దగ్గరకు వెళ్ళాడు.

''నాకు నెల్లూరులో మంచి ఉద్యోగం వచ్చింది. ఇక్కడ ఉద్యోగానికి రిజైన్ చేసి ఇల్లు ఖాళీ చేసి వెళుతున్నాను. బహుశా మిమ్మల్ని కలవడానికి ఇంకెప్పుడూ వీలు కలగకపోవచ్చు. నెల్లూరులో మా ఆఫీస్ అడ్రస్ ఇదిగో. మీ పెళ్ళి శుభలేఖ పంపండి'' కాగితం మీద అడ్రస్ రాసి ఆమెకందించాడు.

కాగితం విసిరి కిందపడవేయబోయి ఆగిపోయింది.

''ఈరోజు కొత్త ఉద్యోగంలో చేరడానికి వెళుతున్నాను. నాకు బెస్ట్ విషెస్ చెప్పండి''

మౌనంగా ఉన్న ఆమెను చూసి ఇంకేం మాట్లాడకుండా ముందుకు కదిలాడు.

ఆరోజు కనిపించిన తులసి ఈరోజు మళ్ళీ ఇలా తనను కలుసుకోవడం చిత్రంగా అనిపించింది విశ్వనాథ్‌కు.

గతాన్ని గురించి ఆలోచనలు కట్టిపెట్టి గుడి ముందు బైక్ ఆపాడు.

బైక్ దిగి తూలి పడబోయి నిలదొక్కుకుంది.

గుడిలోకి నడుస్తూ ఆగి వెనుదిరిగి ఆమెవైపు చూసాడు.

''ఇప్పుడు మనం ఇలా పెళ్ళి చేసుకోవడం నిజంగా నీకిష్టమేనా? బాజా భజంత్రీలు, బంధుమిత్రుల సందడి, అట్టహాసంగా పెళ్ళి ఇవేమీ వద్దా?'' సూటిగా అడిగాడు.

''మీరు నన్ను పెళ్ళి చేసుకుంటే చాలు. నాకు ఎలాంటి ఆర్భాటాలు అవసరం లేదు'' స్పష్టంగా చెప్పింది.

దైవానికి నమస్కరించి తులసివైపు చేయి చాచాడు. గుప్పిటలో ఉన్న పసుపుతాడు అతనికందించింది.

తులసి మెడలో మూడుముళ్ళు వేశాడు.

గర్భగుడిలో నుండి బయటికి వస్తున్న పూజారి, అక్కడే ఉన్న ఒకరిద్దరు భక్తులు ఆ వింత పెళ్ళి చూసి ఆశ్చర్యపోయారు.

మరో పావుగంటలో ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. తలుపు తాళం తీసి చిరునవ్వుతో ఆమెను లోపలికి ఆహ్వానించాడు.

లోపలికి నడిచి సోఫాలో కూర్చుంది.

''నిన్ను చూస్తుంటే మధ్యాహ్నం భోజనం చేసినట్టు అనిపించటం లేదు. ఈ పూట త్వరగా భోజనం చేద్దాం. ముందు ఇవి తీసుకో'' ఆమె ఎదుట బిస్కెట్లు, పండ్లు పెట్టి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

స్నానం చేసి అతను టీ తయారుచేసి తీసుకువచ్చేటప్పటికి సోఫాలో తల కొంచెం పక్కకు వాల్చి నిద్రపోతోందామె.

''తులసీ! ఏమీ తినకుండా నిద్రపోతున్నావు. కొంచెం టీ అయినా తీసుకో'' చేతిమీద నెమ్మదిగా తట్టిలేపాడు.

వెచ్చగా తగిలిందామె ఒళ్ళు.

అనుమానంగా అనిపించి మెడమీద, చెంపల మీద చేయివేసి చూశాడు.

బలవంతంగా కళ్ళు తెరిచింది.

''జ్వరంగా ఉంది కదూ!'' అన్నాడు.

''అవును. నిన్న సాయంత్రం నుండి ఉంది. కానీ మిమ్మల్ని కలవాలన్న ఆదుర్దాతో జ్వరం గురించి పట్టించుకోలేదు'' బలహీనంగా ఉంది ఆమె గొంతు.

''అయామ్ సారీ! నేను ఇందాకటినుండి గమనించలేదు. ప్రయాణం చేసి రావడం వల్ల అలసటతో ఉన్నావనుకున్నాను. డాక్టర్ దగ్గరకు వెళదాం'' అన్నాడు.

''విశ్వనాథ్! ఎవరామె?'' పక్కపోర్షన్‌లో వుండే సాయిబాబు చనువుగా లోపలికి వస్తూ అడిగాడు.

## కల నిజమైంది

**రాణీ ముఖర్జీ ఇప్పుడు తన కల నిజమైందంటోంది. 'ఇండస్ట్రీలోకొచ్చాక బిగ్ బి అమితాబ్‌తో కలిసి నటించాలనుకున్నాను. ఆ తరువాత గొప్ప దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీతో కలిసి ఓ సినిమా చేయాలనుకున్నాను. చాలా కాలానికి నేననుకున్నది నెరవేరింది. నాకు చాలా సంతోషంగా ఉంది. 'బ్లాక్'లో అమితాబ్‌తో పాటూ నటిస్తున్నాను. సంజయ్‌తో కలిసి ఏ హీరో, హీరోయిన్ అయినా సినిమా చేయాలనుకుంటారు. మంచి అభిరుచి ఉన్న దర్శకుడాయన' అంటూ కితాబిస్తోంది. 'బ్లాక్'సినిమాలో తనది విభిన్నమైన పాత్ర అని చెబుతోంది.**



''నా భార్య'' తులసివైపు చిరునవ్వుతో చూస్తూ చెప్పాడు.

''నీకు పెళ్ళెప్పుడైందోయ్?'' సరదాగా అడిగాడాయన.

''అరగంట క్రితం'' చెప్పాడు విశ్వనాథ్.

ఆశ్చర్యంగా తులసి వైపు పరిశీలనగా చూసి అభినందనగా నవ్వాడాయన.

ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా అర్థమైందాయనకు. ''సాయం చేయడానికి సమయానికి మా ఆవిడ కూడా ఊళ్ళో లేదు. ఇప్పుడెలా?'' బాధపడ్డాడు.

''అమ్మాయిని డాక్టర్ దగ్గరకు తీసుకువెళదాం'' బయటికి వెళ్ళి రెండు నిముషాల్లో ఆటో తీసుకువచ్చాడాయన.

హాస్పిటల్ నుండి వచ్చాక ఆమెను మంచంమీద కూర్చోబెట్టాడు.

''కొంచెం పాలు తాగు''

అతని మాట కాదనలేక గ్లాసు అందుకుంది.

రెండు నిముషాల తర్వాత ఖాళీ గ్లాసు తీసుకుని లేచి వెళ్ళబోయాడు.

వాంతి వస్తున్నట్టుగా అనిపించి లేచి వాష్‌బేసిన్ వైపు వెళుతుండగా కళ్ళు తిరిగాయి ఆమెకు.

చప్పున వచ్చి ఆమెను పట్టుకున్నాడు.

నోటికి చేయి అడ్డుపెట్టుకుంది.

వాంతి అయి అతని షర్టుమీద, ఆమె చీరమీద చిమ్మింది.

నెమ్మదిగా వాష్‌బేసిన్ దగ్గరకు నడిపించుకు వెళ్ళాడు.

ముఖం, నోరు శుభ్రం చేసుకుని తలెత్తి అతని వైపు చూసింది.

''సారీ! అయామ్ వెరీ సారీ!'' ఆమెకు చాలా సిగ్గుగా ఉంది అలా జరిగినందుకు.

''ఫర్వాలేదు'' తులసిని వాలుకుర్చీలో కూర్చోబెట్టాడు.

ఫ్లోరింగ్ శుభ్రం చేసి డ్రెస్ మార్చుకుని ఆమె దగ్గరకు వచ్చాడు.

''నువ్వు కూడా కాళ్ళు చేతులు కడుక్కుని బట్టలు మార్చుకుంటావా?''

''నేను బట్టలు తెచ్చుకోలేదు'' చెప్పింది.

అప్పుడు గుర్తొచ్చిందతనికి.

గడియారం చూశాడు. రాత్రి తొమ్మిది కావస్తోంది.

''ఇప్పుడే వస్తాను'' తలుపు దగ్గరగా వేసి బయటికి వెళ్ళాడు.

పావుగంటలో వచ్చాడు.

నీరసంగా కళ్ళు మూసుకుని ఉందామె. ''తులసీ! బట్టలు మార్చుకుంటావా?''

కళ్ళు తెరిచింది.

''నేను వెళ్ళేటప్పటికి షాప్ క్లోజ్ చేయబోతున్నారు. ఇప్పుడు నీకు అవసరం కదా! నైటీలు తీసుకుని వచ్చాను''

దుస్తులు మార్చుకోడానికి నెమ్మదిగా లేచింది.

మూడు రోజులపాటు జ్వరంతో బాధపడ్డ తులసిని కంటికి రెప్పలా చూసుకున్నాడతను.

వేళకు మందులు ఇచ్చి, తేలికగా జీర్ణమయ్యే ద్రవాహారం అందిస్తున్నాడు. రేయింబవళ్ళు ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని ఆమెను కనిపెట్టుకుని చూస్తున్నాడు.

మంచంమీద అటువైపు తిరిగి పడుకుని నిద్రపోతోంది తులసి.

మంచం పక్కన ఉన్న కుర్చీలో కూర్చుని ఆఫీస్ జర్నల్ చదువుకుంటున్నాడు విశ్వనాథ్.

కాలికి ఏదో తగిలినట్లయి కింద చూసాడు.

అటువైపు తిరిగి పడుకున్న ఆమె పొడవాటి జడ కింద జీరాడుతూ అతని కాలికి తగిలింది.

ఆమెకు నిద్రాభంగం కలగకుండా నెమ్మదిగా జడ ఎత్తి మంచం మీద పెట్టాడు.

ఫోన్ రింగైంది. కార్డ్‌లెస్ అందుకున్నాడు.

అతని తల్లి ఫోన్ చేసింది. కోడలి గురించి అడిగింది.

తులసి జ్వరంతో బాధపడుతోందని చెప్పి తల్లిని కంగారు పెట్టడానికి అతని మనసు అంగీకరించలేదు. ఆమె నిద్రపోతోందని చెప్పాడు.

''తన వాళ్ళందరినీ వదిలి నీ దగ్గరకు వచ్చింది. ఏ విషయంలోనూ తులసిని కష్టపెట్టొద్దు'' అంది.

''అలాగేనమ్మా!''

మూడు రోజుల తర్వాత కొద్దిగా కోలుకుంది తులసి. జ్వరం తాలూకు నీరసం ఆమె ముఖంలో ఇంకా కనిపిస్తోంది.

నాలుగో రోజు ఉదయం ఆరు గంటలకు నిద్రలేచి తలుపు దగ్గర ఉన్న పేపర్ అందుకుంటున్న విశ్వనాథ్‌కు మనోహరమైన దృశ్యం కనిపించింది.

వాకిలి కడిగి ముచ్చటగా ముగ్గుపెట్టి ఉంది.

బాల్కనీ వైపు చూశాడు. తలస్నానం చేసింది కాబోలు, తల అటువైపు తిప్పి జుట్టు చిక్కు తీసుకుంటోంది ఆమె.

అతను స్నానం చేసి వచ్చేటప్పటికి వంట చేసింది.

''ఇంట్లో ఎక్కడ ఏమి ఉన్నాయో తెలియదు. నాకు తోచినట్టుగా చేశాను. మీకు నచ్చుతుందో లేదో నా చేతి వంట'' పళ్ళెంలో వడ్డిస్తూ అంది.

వేడి అన్నంలో బీరకాయ కూర, మిరియాల చారు రుచికరంగా ఉన్నాయి.

''నేను ఆఫీసుకు వెళ్ళనా? ఇంటి దగ్గర ఒంటరిగా ఉండగలవా మరి?'' అడిగాడు.

''మూడు రోజుల నుంచి సెలవుపెట్టి ఇంటి దగ్గర నన్ను కనిపెట్టుకుని వున్నారు. ఆఫీసుకు వెళ్ళి రండి. నేను ఉండగలను'' అంది.

అతను ఆఫీసుకు వెళ్ళడానికి సిద్ధమై బయటికి నడవబోతుండగా దిగులుగా అనిపించిందామెకు.

''సాయంత్రం త్వరగా వస్తారు కదూ'' తలుపు వరకు వచ్చి అడిగింది.

అలాగేనంటూ ఆమెవైపు చూసి నవ్వాడు.

''తులసీ బయటికి వెళదామా?'' సాయంత్రం వస్తూనే అడిగాడు.

''ముందు టిఫిన్ చేయండి'' అతని చేతికి టిఫిన్ ప్లేట్ అందించింది.

చీరల షాపులోకి తీసుకెళ్ళాడు. తన అవసరాలు చెప్పకపోయినా అర్థం చేసుకున్నాడు అనుకుంది.

రెండు కాటన్ చీరలు, ఒక సిల్క్ చీర ఎంచుకుంది. ఆమె వారిస్తున్నా వినకుండా ఖరీదైనవి మరో రెండు చీరలు తీసుకున్నాడు.

లోదుస్తుల విభాగంలో సేల్స్‌గాళ్‌తో మాట్లాడబోయి పక్కనే వున్న అతనివైపు చూసి మొహమాటంగా ఆగిపోయింది.

ఆమె ఇబ్బందిని గ్రహించి పక్కకు వెళ్ళి నిలబడ్డాడు.

బిల్లు చెల్లించి బయటికి నడిచారు.

జ్యుయలరీ షాపులోకి దారితీస్తున్న అతని చేయి పట్టుకుని వారించింది. ''ఇంకేమీ వద్దు. ఇంటికి వెళదాం పదండి. ఇప్పటికే చాలా ఖర్చుపెట్టారు''




''ఫర్వాలేదు. మనకు ఆ స్థోమత ఉంది'' ఆమె చేతిని సున్నితంగా నొక్కి వదిలాడు.

మారు మాట్లాడలేక అతన్ని అనుసరించింది.

ఆమెకు బంగారు గాజులు, మెడలోకి గొలుసు, మంగళసూత్రాలు తీసుకున్నాడు.

అతను కొన్న నగలు చూసి బాధగా అనిపించింది తులసికి. అప్పటి వరకు కళగా ఉన్న ఆమె ముఖం చిన్నబో

యింది.

ఇంటికి వచ్చాక కూడా నిశ్శబ్దంగా ఉన్న ఆమెను చూసి ''నువ్వు వేసుకోవడం వల్ల ఈ గాజులకే అందం వచ్చింది కదూ!'' చేతి గాజులు సరిచేస్తూ ఆమెను నవ్వించడానికి ప్రయత్నించాడు.

అతని వైపు చూసింది.

ఆమె కళ్ళలో తిరుగుతున్న నీటిని చూసి కంగారుపడ్డాడు. ''నేనేమైనా తప్పు మాట్లాడానా?'' అడిగాడు.

''ఊహు మీరు తప్పు మాట్లాడలేదు. నాకోసం నగలు కొనడం చాలా బాధగా ఉంది. నేను మీ స్థాయికి తగిన భార్యను కాదనిపిస్తోంది. అత్యాశతో ప్రవర్తించి మీచేత బలవంతంగా నా మెడలో మూడుముళ్ళు వేయించుకున్నాను కదూ!'' ఆమె కళ్ళు ధారగా వర్షిస్తున్నాయి.

ఆమె తలమీద చేయి వేశాడు. ''అలా ఇంకెప్పుడూ అనుకోవద్దు. నువ్వంటే నా మనసులో ఎంత ఇష్టం ఉందో నాకు మాత్రమే తెలుసు. నిన్ను కించపరచాలని జ్యుయలరీ కొనలేదు. మన ఆనందం కోసమే ఇవి కొన్నాను''

అతని మాటలు ఆమెకు ఊరట కలిగించాయి. కళ్ళు తుడుచుకుంది.

మంగళసూత్రాలు గొలుసుకు గుచ్చి అతని చేతికి అందించి నిలబడింది. ఆమె మెడలో వేశాడు చిరునవ్వుతో.

మరో వారం గడిచింది. జ్వరం తాలూకు నీరసం పూర్తిగా తగ్గిందామెకు.

ఉదయం స్నానం చేసి వచ్చి డ్రెస్ చేసుకోబోతున్నాడతను. బెడ్‌రూమ్‌లోకి వచ్చింది తులసి ఏదో పనిమీద. మగసిరి ఉట్టిపడుతున్న అతని విశాలమైన ఛాతీమీద ఆమె దృష్టిపడింది. తలదించుకుని వెనుదిరిగింది. ''తులసీ! ఇలా రా'' బనియన్ వేసుకుంటూ పిలిచాడు.

దగ్గరగా వచ్చింది.

''వీక్‌నెస్ పూర్తిగా తగ్గిందా? ఆర్ యు ఓకె?'' అడిగాడు నవ్వుతూ.

ఆ నవ్వులో కోటి అర్థాలు ధ్వనించాయి.

జవాబుగా ఆమె కూడా నవ్వింది. ఆమె ముఖం చూస్తేనే తెలుస్తోంది పూర్తిగా కోలుకున్నట్టు.

బీరువాలో నుండి కొత్త చీర తీసి ఆమె చేతిలో పెట్టాడు ''సాయంత్రం కట్టుకో''

రోజంతా అతని కోసం ఎదురు చూస్తూ గడిపింది. ఆఫీసునుండి వస్తూనే ఆమెకు పూలు అందించాడు.

స్నానం చేసి వచ్చాడు విశ్వనాథ్. కొత్త పైజమా, లాల్చీ వేసుకుని మరింత అందంగా వున్నాడు.

తలుపు గడియవేసి ఆమెను హత్తుకుని నుదుటిమీద చుంబించాడు. ఒళ్ళు ఝల్లుమంది తులసికి. పరవశంగా కళ్ళు మూసుకుంది. ఆమె స్పర్శ అతనికి ఎంతో హాయిగా అనిపిస్తోంది. రెండు నిముషాలపాటు అలాగే నిలుచుండిపోయారు.

కాలింగ్‌బెల్ మోగింది. తలుపు తీశాడు విశ్వనాథ్.

తులసి తల్లి నిలబడి ఉంది గుమ్మం దగ్గర.

''రండి'' లోపలికి ఆహ్వానించాడు.

తల్లిని చూడగానే తులసి కళ్ళు ఆనందంతో మెరిశాయి. ''నువ్వు ఎలా ఉన్నావో అని ఈ పది రోజుల నుండి మేము ఎంతగానో ఆందోళన పడ్డాము. నువ్వు రాసిన ఉత్తరం అందింది. నిన్ను చూడాలనిపించి మీ నాన్నగారిని ఒప్పించి ఈరోజు బయల్దేరి వచ్చాను'' కూతురితో చెప్పిందామె.

విశ్వనాథ్ వైపు తిరిగింది.

''తులసికి జ్వరం వచ్చినప్పుడు మీరు ఎంత శ్రద్ధగా చూసుకున్నారో తను రాసిన ఉత్తరాన్నిబట్టే తెలిసింది. ఇరవై ఏళ్ళ క్రితం మా ఆడపడుచుకు జరిగిన చేదు అనుభవం వల్ల వయసులో వున్న మగపిల్లల మీద మేము నమ్మకాన్ని కోల్పోయాము. మీరు మా ఇంటికి వచ్చి తులసిని పెళ్ళి చేసుకుంటానని అడిగినప్పుడు మేము అనుచితంగా ప్రవర్తించాము'' అంది.

''నాకు ఎంతో ఇష్టమైన మా అమ్మమీద ఒట్టేసి చెబుతున్నాను. తులసికి ఎలాంటి కష్టం రానివ్వను. నన్ను నమ్మండి'' అల్లుడి మాటలకు సంతోషంగా చూసిందామె.

ముగ్గురూ భోజనం చేశారు. తల్లి నిద్రపోయాక గదిలోకి వచ్చింది తులసి. ఆమె వైపు అల్లరిగా చూశాడు విశ్వనాథ్.

జీవితంలో ఇంతకుముందెన్నడూ చవిచూడని ఓ కొత్త అనుభవం కోసం వారి తనువులు, మనసులు తహతహలాడుతున్నాయి.

తులసిని మంచంమీద పడుకోబెట్టి మీదికి వంగాడు. ఆమె పెదవులు వణుకుతున్నాయి. కంపిస్తున్న ఆమె అధరాలను తన అధరాలతో స్పృశించాడు మృదువుగా.

భార్య చెక్కిళ్ళపై మధురంగా ముద్దులు పెట్టాడు. అతని మెడమీద చుంబించిందామె.

నెమ్మదిగా ప్రారంభమైన ఆ దంపతుల తొలి శృంగారక్రీడ క్రమేపీ వేగం అందుకుంది. వలువలు వేరయ్యాయి. ఒకరినొకరు ఆర్తిగా హత్తుకుని ఇరువురూ ఒక్కటై తాదాత్మ్యం చెందారు. వారి కళ్ళు సంతోషంగా మెరుస్తున్నాయి.

అద్భుతమైన భావన అణువణువునా వ్యాపించి సంతృప్తిగా విశ్రమించారు.

అతని ఛాతీపై తల పెట్టుకుని నిద్రపోతున్న తులసిని మరింత దగ్గరగా లాక్కున్నాడు విశ్వనాథ్.

ఉదయం స్నానం చేసి వంట చేస్తోంది తులసి. కూతురివైపు పరిశీలనగా చూసిన ఆమె తల్లికి ఏదో కొత్తదనం కనిపించింది. తులసి కళ్ళలో రాత్రి కనిపించని కొత్త మెరుపు, సంతోషం, అలసట ఇప్పుడు కనిపిస్తున్నాయి.

ఆశ్చర్యంగా అనిపించిందామెకు. ఈ పదిరోజుల నుండి కలిసి వుంటున్నా గత రాత్రి వరకూ వీరి తొలి కలయిక జరగలేదా? అనుకుంది.

తన అనుమానాన్ని నిర్ధారణ చేసుకోడానికి వారి పడకగది వైపు తొంగి చూసింది.

అప్పుడే నిద్రలేచాడు విశ్వనాథ్.

దుప్పటిమీద ఒత్తుగా పరచబడి రాత్రి అంతా తమకు ఆహ్లాదం కలిగించిన మల్లెపూలు వాడి వున్నాయి. అతని పెదవులపై చిరుదరహాసం మెరిసింది.

వాడిన మల్లెలను తీసి దుప్పటి సరి చేస్తున్నాడు.

అల్లుణ్ణి చూసి నవ్వుకుని నిశ్శబ్దంగా పక్కకు తప్పుకుందామె.

తులసి నీరసంగా ఉండటం వల్ల ఇంతకాలం ఓర్పుగా వ్యవహరించిన విశ్వనాథ్ నిగ్రహశక్తి గ్రహించి ముచ్చట పడిందామె.

వంటగదిలో పనిచేస్తున్న తులసి దగ్గరకు వెళ్ళింది.

''మంచి భర్తను తెచ్చి నీకు ఘనంగా పెళ్ళిచేసే తాహతు మాకులేదు. అందుకే మీ పెదనాన్న అల్లుడితో నీ పెళ్ళి చేయడానికి సిద్ధపడ్డాము. మా అశక్తతను అర్థం చేసుకుని మన్నించు తల్లీ! పూర్వజన్మ పుణ్యఫలం వల్ల నీకు యోగ్యుడైన భర్త దొరికాడు. నాకు చాలా సంతోషంగా ఉందమ్మా! అల్లుడుగారు నిద్రలేచారేమో చూడు. ఆయనతో చెప్పి నేను ఊరికి బయల్దేరతాను. ఇంటి దగ్గర మీ నాన్నగారు, చెల్లాయి నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు'' అంది.

బెడ్‌రూమ్ వైపు వెళుతున్న తులసిని ఆనందంగా చూస్తోందామె. ☆

